క్లుప్తంగా

గ్రామాల్లో వైద్య శిబిరాలు



బూడిపేటలో ప్రజలకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మ, సిబ్బంది

గజపతినగరం: మండలంలోని బూడిపేట,దావాలపేట గ్రామాల్లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుష్మ ఆధ్వర్యంలో గురువా రం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 104 వైద్య సిబ్బందితో కలిసి వైద్యాధికారి 93 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసర మైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పించండి



వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి, 2023–24 ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు పనిదినాలు పూర్తికాని వారందరికీ ఈనెలాఖరులోగా పను లు కల్పించాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు ఉపాధి సిబ్బందికి సూచించారు. మండలంలోని చిన్నతామరాపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఆయన పరిశీలించారు. మస్తర్ల సీట్లను తనిఖీ చేశారు. పని ప్రదేశంలో తాగు నీరు, టెంట్లు అందుబాటులో ఉంచాలని మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ తిరుమలరావు

జామి: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండలంలోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ఎంపీడీఓ తిరుమలరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సర్వసభ్య సమావేశం సాధాసీదాగా కోడ్ నిబంధనలకు లోబడి సాగింది. సమావేశంలో ఎంపీడీఓ ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ,వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు,ఎన్నింటి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా అప్పారావు



గంట్యాడ: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా జాగరపు అప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. అప్పారావు ప్రస్తుతం మదనాపురం సర్పంచ్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య గెలుపే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

నలుగురు వలంటీర్ల తొలగింపు

విజయనగరం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తూ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నలుగురు వలంటీర్లను తొలగించినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.కోట మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అలుగుబిల్లి గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లు బత్తుల కృష్ణ, బోనెల మనోజ్ కుమార్‌లను విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గరివిడి మండలం చుక్కవలసకు చెందిన ఇద్దరు వలంటీర్లు కిల్లాన ప్రసాద్, రేవళ్ల త్రినాథ్‌లను తొలగించామన్నారు.

నివాళులు..



వెంకటస్వామి, శేషగిరి చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న యుటీఎఫ్ నేతలు

జామి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతి, రాష్ట్ర మాజీ కార్యదర్శి కె. శేషగిరి జయంతి సందర్భంగా యూటీఎఫ్ నేతలు మండల కేంద్రంలో వారి చిత్రపటాలకు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల ప్రధానకార్యదర్శి ఎం.తాతంనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు మాట్లాడుతూ.. వెంకటస్వామి, శేషగిరి స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటీఎఫ్ సీనియర్ నాయకుడు కొల్లు సూర్యనారాయణ, నాయకులు జి.ప్రసాద్, ఎ.జనార్దనరావు, ఎస్.ముత్యాలు, రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం

- మాటకు కట్టుబడి ఉండే వ్యక్తి సీఎం జగన్
- సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా భావించి పాలన అందించాం
- చంద్రబాబు బూటకపు హామీలను నమ్మ వద్దు
- ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స సత్య నారాయణ, జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన



రాచపేట ఎన్నికల సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ వేదికపై ఎంపీ బెల్లాన, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: ప్రజలను మోసం చేయడం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి నైజమని, 2014 ఎన్నికల సమయంలో 600 హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని హామీలు నెరవేర్చారో ప్రజలు గుర్తు చేసుకోవాలని, అన్ని వర్గాలను ఆయన మోసం చేశారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మెరకముడిదాం మండలం రాచపేట, సిరిదేవిపురం గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరికి ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి, కుంకుమ దిద్దారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో మంత్రి బొత్స మాట్లాడుతూ చంద్రబాబునాయుడు నోరు విప్పితే అన్ని అబద్ధాలేనని, ప్రజలకు ఎలాంటి మేలు చేయడని ఎద్దేవా చేశారు.టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి అభివృద్ధి చేయకుండా, ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేశారని, ఇప్పుడు ఎన్నిక లు వచ్చేసరికి ఓట్లు దండుకోవడానికి ఆ పార్టీ నాయకులు మీ దగ్గరకు వచ్చి మాయమాటలు చెబుతారని, వాటిని నమ్మి మొసపోవద్దని ప్రజలకు సూచించారు. రాచపేట, సిరిదేవిపురం గ్రామాలకు గతంలో రహదారులు లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడేవారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తారురోడ్లు వేశామని, ఇంటింటికీ కుళా యిలు ఏర్పాటుచేసి తాగునీటి సమస్య పరిష్కరించామని మంత్రి బొత్స వివరించారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను నిర్మించి వాటి ద్వారా గ్రామంలోనే ప్రభుత్వ సేవలు, విత్తనాలు, ఎరువులు, వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా గడిచిన అయిదేళ్లలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, అలాగే ఈరెండు గ్రామాలతో పాటు నియోజగవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసింది మంత్రి బొత్స



సిరిదేవిపురంలో మంత్రి బొత్సకు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

సత్యనారాయణేనని అన్నారు. ఎంపీ బెల్లానచంద్రశేఖర్ మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధికి నిరంతం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని, తనను, మంత్రి బొత్సను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బూరాడ గోవిందరావు, అప్పల నాయుడు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



సమావేశానికి హాజరైన గజపతినగరం,దత్తిరాజేరు మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. స్థానిక బెల్లాన కన్వెన్షన్‌లో గజపతినగరం,దత్తిరాజేరు మండలాల పార్టీ కార్యకర్తలు,నాయకులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భం గా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీ లతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సీఎం సమప్రా ధాన్యం ఇచ్చారని చెప్పారు. చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ వివరించాలని పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులను ఎమ్మెల్యే కోరారు.పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ పి.వి.వి.సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు)మాట్లాడుతూ గజపతినగరం ఎమ్మెల్యేగా అప్పలనరసయ్య, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను మరోమారు బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకులు నారాయణ మూర్తిరాజు, ప్రభూజీరాజు, ఎమ్మెల్యే అప్పలనరసయ్య తనయుడు, యువనాయకు డు బొత్స సాయి గురునాయుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, గజపతినగరం,దత్తిరాజేరు మండలాల జెడ్పీటీసీలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, రాపాక కృష్ణమూర్తి, దత్తిరాజేరు ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్లు కె.సుబ్రహ్మణ్యం, మహదేవ్ ఫణీంద్రుడు, దత్తిరాజేరు వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, స్థానిక ఏపీసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, నాయకులు రెడ్డి పద్మావతి, మండల సురేష్,బెల్లాన త్రినాథ రావు, లెంక శ్రీనివాసరావు, సామంతుల పైడిరాజు, బమ్మిడి అప్పలనాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి సిద్ధం కండి

- చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించండి
- వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో ఆపార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ డిప్యూటీ కో–ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): సార్వత్రిక ఎన్నికలు సమరానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని, పార్టీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ డిప్యూటీ కో–ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గరివిడి మండలంలోని కె.పాలవలస గ్రామంలో మండలంలోని సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఎన్ని క ల ప్రచారం, గ్రామాల్లో నాయకులు చేపట్టాల్సిన కార్యక్రమాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోనికి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు.గత టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనకు మధ్య వ్యత్యాసాలను వివరించాలని చెప్పారు. 2014లో టీడీపీ 600 హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు ఎలా మోసం చేశారో గుర్తు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష పార్టీలు, ఆ పార్టీ అనుకూ మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచా రాన్ని తిప్పికొడుతూ ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో జరగనన్ని అభివృ ద్ధి,సంక్షేమ కార్యక్రమాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగాయని, ప్రజలంతా పార్టీకి అనుకూలంగా ఉన్నారన్నారు. విజయం మన వై పు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వ్యవహరించకుండా అప్రమత్తంగా ఉంటూ చీపురుపల్లి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్న బొత్స సత్యనారాయణను, విజయనగరం ఎంపీగా పోటీ చేయనున్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపిం చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కొణిశ కృష్ణంనాయుడు, పీఏసీఎస్‌ల అధ్యక్షులు, తదిత రులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పై అవగాహన



గొట్లాంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, వైద్య సిబ్బంది

బొండపల్లి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ – 2 పీఓ బొత్స ధర్మారావు అన్నారు. మండలంలోని గొట్లాంలో ఎన్ఎస్ఎస్–2 ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారమ్మ జాతరకు పోటెత్తిన ప్రజలు



ఎల్లారమ్మ జాతరలో పాల్గొన్న భక్తుల సందడి

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేటలో జరుగుతున్న ఎల్లారమ్మ జాతకు గురువారం భక్తులు పోటెత్తారు. మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు. గజపతినగరం, డోలపాలెం, సీతారామపురం, పిడిశీల, తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఓటు వజ్రాయుధం



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

గజపతినగరం రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిందని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని గజపతినగరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, విజయనగరం ఆర్డీఓ సూర్యకళ అన్నారు. ఓటు హక్కు వినియోగంపై మండల కేంద్రంలో బీఎల్‌ఓలు, ఎన్నికల సిబ్బందితో కలిసి గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వ హించారు. ముందుగా ద్విచక్రవాహనాలతో ర్యాలీ చేశారు. నాలుగురోడ్ల కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. బస్సులో వెళ్తున్న ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మనం వేసే ఓటు దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

అనంతరం రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్‌ను పాటించాలని, ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యేలా సహకరించాలని కోరారు.

కార్మికుల భద్రత ముఖ్యం



పోటీల్లో గెలుపొందిన కార్మికులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా పరిశ్రమలశాఖ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్

లక్కవపుకోట: పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రత చాలా ముఖ్యమని, ఆబాధ్యత యాజమాన్యానిదేనని విశాఖపట్నం జిల్లా పరిశ్రమలశాఖ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వి.సురేష్ అన్నారు. భద్రతా వారోత్సవాల ము గింపు సందర్భంగా మండలంలోని శ్రీరాంపురం గ్రామ సమీపంలోని స్టీల్ ఎక్సేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారంలో గురువారం అవగా హన కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా హాజరైన సురేష్ మా ట్లాడుతూ కార్మికులంతా పనిలోకి వెళ్లే ముందు భద్రతా సామగ్రిని ధరించాలని సూచించారు. కార్మికులు భద్రతకు అవసరమైన అన్ని చర్యలు యాజమాన్యం తీసుకుంటూ, కార్మికులు భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పర్యవేక్షించాలన్నారు. అనంతరం కార్మికులకు వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కర్మాగార మేనేజర్ బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వర్మరాజు, సేఫ్టీ మేనేజర్ కమల్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ అధ్యక్షురాలు ప్రమీల జి.షరాఫ్

చీపురుపల్లిరూరల్(గరివిడి): దివ్యాంగుల అభ్యున్నతికి, వారి జీవితాల్లో మార్పు తీసుకువచ్చేందుకు గరివిడి ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ కృషి చేస్తోందని ఆసంస్థ అధ్యక్షురాలు ప్రమీల జి.షరాఫ్ తెలిపారు. గరివిడిలోని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మా ట్లాడుతూ తమ సంస్థ ఎంతోమంది దివ్యాంగులకు ఆసరాగా నిలుస్తోందని చెప్పారు. దివ్యాంగులకు విద్యాబోధన చేయడమే కాకుండా, వారి ఆసక్తికి తగిన విధంగా వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. తమ సంస్థ ద్వారా చదువుకున్న దివ్యాంగుల్లో చాలా మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగులుగా స్థిరపడ్డారన్నారు. ఎంతో మంది దివ్యాంగులకు రుణాలు ఇప్పించి, స్వయం ఉపాధి కల్పించామని చెప్పారు. అనంతరం దివ్యాంగుల మానసిక,శారీరక ఆరోగ్యం కోసం నాగపూర్ వైద్యులు ప్రత్యేక యోగా ఆసనాలపై అవగాహన కల్పించారు.

క్షయ వ్యాధిపై అవగాహన



వేపాడ: ఆదర్శపాఠశాలలో క్షయవ్యాధి లక్షణాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ధరణి

వేపాడ: క్షయ వ్యాధి లక్షణాలపై వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధరణి గురువారం స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్షయవ్యాధి సోకిన వారికి ఆరు లక్షణాలు ఉంటాయన్నారు. ఒకటి లేదా రెండు వారాలకు పైబడి దగ్గు, ఛాతిలో నొప్పి, ఆకలి లేకపోవుట, బరువు తగ్గడం, సాయంత్రం వేళల్లో జ్వరం రావడం, కఫంలో రక్తం పడుట వంటి లక్షణాలు కనబడితే వెంటనే పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, సీహెచ్‌ఓ ఆంజనేయులు, హెచ్‌జి రమణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి రహిత సమాజమే లక్ష్యం

కొత్తవలస : క్షయవ్యాధి రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని వియ్యంపేట పీహెచ్‌సీ డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి సచివాలయం పరిధి సీతంపేటలో క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన చికిత్స లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యారావు, బి.శ్రీనివాసరావు, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

వేపాడ: మండలంలోని జాకేరు ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. ముందుగా విద్యార్థుల వర్క్ బుక్స్, ఉపాధ్యాయుల లెసెన్ ప్లాన్‌ను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించడంతో పాటు తెలుగు, ఇంగ్లిష్ పదాలు రాయించారు. మధ్యాహ్న భోజన వంటకాలను రుచిచూశారు. అనంతరం చామలాపల్లి, కరకవలస ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కరకవలసలో నాడు–నేడు పనులను పరిశీలించారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



జామి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర,కేంద్ర పోలీసు బలగాలు మండల కేంద్రం జామితో పాటు జాగరం, చింతాడ, పావాడ గ్రామాల్లో గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్.కోట సీఐ ఉపేంద్ర, జామి ఎస్ఐ వీరబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలని ప్రజలను కోరుతూ ఫాగ్ మార్చ్ నిర్వహించామని తెలిపారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యద ర్శులు, వీఆర్‌ఓలకు ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ ఓలకు ఎన్నికల కోడ్ అమలుపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈసం దర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోనూ ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలని చెప్పారు. అప్ర మత్తంగా ఉంటూ రాజకీయ పార్టీ నాయకుల నుంచి ఎటువంటి ఫిరాద్యులు రాకుండా నిబంధనలను పక్కాగా అమలు చేయాలని సూచించారు.అభ్యర్థుల ఎన్నికల ప్రచారాన్ని పరిశీలించి నిబంధనలను అతిక్రమిస్తే ఫిర్యాదు చేయాలని చెప్పారు. అనుమతులు లేకుండా పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, జెండాలు కడితే చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ హనుమంతురావు, డిప్యూటీ తహసీల్దార్ పి.హరి, ఈఓపీ ఆర్డీ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పనిచేసే వ్యక్తి సీఎం జగన్



ఎస్.కోటలో ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- సంక్షేమ సారథి సీఎం జగన్‌ను ఆశీర్వదించండి
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ,ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థుల బొత్స ఝాన్సీలక్ష్మి, కడుబండి



ఎస్.కోటలోని ముత్యాలమ్మ గుడిలో పూజలు చేస్తున్న ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం , రాష్ట్రాభివృద్ధి కోసం పని చేసే వ్యక్తి అని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా ఆయన్ని ఆశీర్వదించాలని విశాఖపట్నం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. గురువారం సాయంత్రం ఎస్.కోట పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రచార ర్యాలీ శ్రీనివాసకాలనీ, ప్రధాన రహదారి, దేవీ జంక్షన్, గాంధీబొమ్మ, కందాలవీధి, వన్‌వే జంక్షన్, పురసాకారి జంక్షన్, ప్రకాశం మార్కెట్, గొల్లవీధి, ప్రకాశం మార్కెట్ ప్రాంతాల మీదుగా సాగింది. ప్రకాశం మార్కెట్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలుచోట్ల మహిళలు వీరికి నీరాజనాలు ఇచ్చి, తిలకం దిద్దారు.ఎంపీ అభ్యర్థి ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ నేను, మీ ఇంటి కోడలినని, విశాఖ నుంచి ఈ జిల్లాకు వచ్చిన నన్ను ఎంపీగా, జెడ్పీ చైర్మన్‌గా ఆదరించార న్నారు. మీ అందరికీ సేవ చేసే భాగ్యం కోసం ఇప్పుడు విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తూ మిమ్మల్ని ఓటు అడుగుతున్నానన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నన్ను ఎంపీగా,కడుబండి శ్రీను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ ఈ అయిదేళ్లలో మీ అందరికీ అందుబాటులో ఉంటూ, ఎవరికి ఏ అవసరమైనా నేనున్నా అంటూ భరోసా ఇచ్చానన్నారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేశానని, పేదల కోసమే ప్రభుత్వాన్ని నడుపుతున్న జగనన్నకి మద్దతివ్వాలని ప్రజలను కోరారు. విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి కోలా గురువులు, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌రాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, డీసీసీబీ చైర్మన్ వి.చిన రామునాయుడు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.నాయుడుబాబు, స్టేట్‌ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పట్టణపార్టీ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, మండల యువత అధ్యక్షుడు అల్లు సుధీర్, జెడ్పీటీసీలు, టి.వరలక్ష్మి, ఎస్.శ్రీదేవి, ఎం.వెంకటలక్ష్మి, ఎస్.అప్పారావు, ఎంపీపీలు ఎస్.గోపమ్మ, గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు , నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.